


పూల సోయగం



- పుష్ప పల్లకిపై విహరించిన శివ పార్వతులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నేడు గజ వాహన సేవ



ఉత్సవాల్లో కళాకారుడి శివతాండవం



శ్రీశైలం, మార్చి 6: వివిధ సుగంధ పరిమళాలను వెదజల్లే పుష్ప పల్లకిపై ఆదిదంపతులు శివపార్వతులు విహరించారు. పుష్ప పల్లకిపై భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల సోయగాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో మైమరిచారు. మహాశివరాత్రిను పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలను చేశారు. చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాధికాలు జరిపించారు. అనంతరం లోక కల్యాణార్థం జపాలు, పారాయణాలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, చండీహోమం, రుద్రహోమం తదితర కైంకర్యాలను ఆగమశాస్త్రం ప్రకారం జరిపించారు.



పుష్ప పల్లకిపై దర్శనమిస్తున్న మల్లికార్జున స్వామి, అమ్మవారు



కర్ణాటక భక్తుల బీసయ్య ప్రదర్శన

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

పుష్పప్రియుడు మల్లన్న దేవేరి భ్రామరీతో కలసి పూలపల్లకిపై విహరిస్తున్న అపురూప దృశ్యాలను వీక్షించేందుకు వేలాదిగా భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. బుధవారం రాత్రి గ్రామోత్సవానికి ముందు ఉభయ దేవాలయ అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ముస్తాబైన ఆదిదంపతుల ఉత్సవ విగ్రహాలను రాజగోపురం నుంచి ఆలయ వెలుపలకు తోడ్కొనివచ్చి పుష్ప పల్లకిపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పల్లకి ఉత్సవం ఆలయ ముందుభాగం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు సాగింది. తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా ఆలయ రాజగోపురం చేరుకుంది. ఉత్సవం ఎదుట జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు, తప్పెట్లు, భజంత్రీలు, మేళతాళాలు, శంఖునాదాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గజ వాహన సేవ: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి గజవాహనసేవ నిర్వహించనున్నారు.





గ్రామోత్సవానికి భారీగా తరలి వచ్చిన శివ భక్తులు



స్వామివారి పల్లకిని మోస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఇతర అధికారులు

రూ. 26.87 కోట్ల సబ్సిడీ విడుదల

కలెక్టర్ కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 6: ఇన్‌పుట్ సబ్సిడీ కింద 27,138 మంది రైతులకు రూ.26.87 కోట్లు జమ చేశామని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు, తదితరులు పాల్గొని వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రైతులను చెక్కును పంపిణీ చేశారు.



రైతులకు జంబో చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్, వ్యవసాయ సలహామండలి చైర్మన్, తదితరులు



నందీశ్వరునికి కంకణ ధారణ చేస్తున్న వేద పండితులు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మహానందిలో పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

మహానంది, మార్చి 6: మహానంది క్షేత్రంలో బుధవారం వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి అమ్మవారి ఆలయాల్లో వేదమంత్రాలతో బ్రహ్మోత్సవాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలతోపాటు గణపతి పూజ, పుణ్యాహవచనం, త్రిశూల చండీశ్వరార్చన, దీక్ష కంకణధారణలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి దంపతులు గోపూజ చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానించేందుకు వీలుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. రాత్రి మయూర వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.



కాణిపాకం నుంచి పట్టువస్త్రాలు

మహానంది క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలను తెచ్చారు. ఆలయ పాలక మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశ్వర్లు తీసుకురాగా వీరికి ఆలయ ముఖ మండపం వద్ద ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో వాటిని తీసుకెళ్లారు. వేద పండితులు పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు చేసి ఈవోకు అందజేశారు. గురువారం మహానందిలో మహా శివరాత్రి బ్రహ్మోత్స వాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం సూర్య ప్రభ వాహన సేవ, రాత్రి రావణ వాహన సేవ నిర్వహిస్తారు.

పెను ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో నవ దంపతుల మృతి
- వరుడి తల్లిదండ్రులు, డ్రైవరుతో సహా దుర్మరణం
- 40వ జాతీయ రహదారిపై ప్రమాదం
- ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- తిరుమల నుంచి సికింద్రాబాదుకు వెళ్తుండగా ఘటన

కునుకు రూపంలో మృత్యువు వారిని వెంటాడింది. నవ దంపతులను కానరాని లోకాలకు తీసుకుపోయింది. వారితోపాటు వరుడి తల్లిదండ్రులు, డ్రైవర్‌నూ కబళించేసింది. ఈ ఘటన ఆ కుటుంబాల్లో పెను విషాదం నింపింది. తిరుమలలో వేంకటేశ్వర స్వామికి మొక్కుబడి చెల్లించి తిరిగి స్వగ్రామనికి వెళ్తుండగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ 40వ జాతీయ రహదారిపై నల్లగట్ల గ్రామం వద్ద బుధవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు దుర్మరణం చెందగా, వారిలో ఒకే కుటుంబ సభ్యులు నలుగురు ఉన్నారు.



మృతి చెందిన బాలాకిరణ్, కావ్యశ్రీ (ఫైల్)



ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొన్న కారు



ఆళ్లగడ్డ, మార్చి 6: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ 40వ జాతీయ రహదారిపై నల్లగట్ల గ్రామం వద్ద బుధవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నవ దంపతులు బాలకిరణ్ (30), కావ్యశ్రీ(28), వరుడి తల్లిదండ్రులు రవీందర్(55), లక్ష్మి(49), డ్రైవరు అశోక్(23)తో కలిపి ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాదు ఈస్ట్ వెంకటాపురానికి చెందిన వారు కాగా డ్రైవరు అశోక్ మాత్రం నాగర్‌కర్నూలుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. సికింద్రాబాదు ఈస్ట్ వెంకటాపురం గ్రామానికి చెందిన మంత్రి రవీందర్, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు బాలకిరణ్‌కు గత నెల ఫిబ్రవరి 29వ తేదీన తెనాలికి చెందిన గోవర్ధనరావు, నాగ వరలక్ష్మి దంపతుల పెద్ద కూతురు కావ్యశ్రీతో వివాహం జరిగింది. మొక్కుబడి తీర్చుకోవడానికి తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనార్థం మంగళవారం తెనాలి నుంచి తిరుపతికి వెళ్లారు. అక్కడ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని కారులో అదే రోజు రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌కు బయలుదేరారు. వీరి వాహనం తెల్లవారుజామున 5.30 గంటలకు ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం వద్దకు రాగానే అక్కడ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో కారులోని నవ దంపతులు బాలకిరణ్, కావ్యశ్రీ, వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి, డ్రైవరు అశోక్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ నరసింహులు, పోలీసు సిబ్బంది, హైవే సిబ్బంది చేరుకొని జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం పూర్తవగానే శవాలను బంధువులకు అప్పగించారు. డ్రైవర్ అశోక్ కునుకుపాటే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. రవీందర్ కుమారుడు ఉదయ్ కిరణ్ ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిన్నంటిన రోదనలు

బాలకిరణ్, కావ్యశ్రీల వివాహం జరిగి పసుపు పారాణి ఆరక ముందే ప్రమాదానికి గురవటంతో బంధువుల్లో విషాద చాయలు అలుముకున్నాయి. అమ్మాయి తల్లిదండ్రుల రోదనలు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పలువురిని కంట తడిపెట్టించాయి. మిన్నంటే రోదనలతో మృతదేహాలను వారి బంధువులు స్వగ్రామాలకు తీసుకెళ్లారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాక..

తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాదు ఈస్ట్ వెంకటాపురంలో కిరాణం షాపు నడుపుకుంటూ జీవనం చేస్తున్న మంత్రి రవీందర్, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్దకుమారుడు బాలాకిరణ్‌కు సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం రావడంతో తెనాలిలో టైలర్‌గా పని చేస్తున్న గోవర్ధనరావు, నాగ వరలక్ష్మి దంపతుల పెద్దకుమార్తె కావ్యశ్రీతో ఫిబ్రవరి 29న వివాహం జరిపించారు. వీరి వివాహం జరగటంతో మొక్కుబడి చెల్లించడానికి తిరుపతి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఘోర ప్రమాదానికి గురయ్యారు.



↑ మృతి చెందిన వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి (ఫైల్)



మృతి చెందిన డ్రైవర్ అశోక్ (ఫైల్)

ఈసారి శివయ్య నిశ్చితార్థం ఎక్కడ?

ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోని మండపం



నిశ్చితార్థ మండపం కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా ఇక్కడ మహానందీశ్వరుడికి, కామేశ్వరి అమ్మవారికి కల్యాణం జరిపించడం ఆన వాయితీగా వస్తోంది. కల్యాణంలో భాగంగా ప్రధాన ఆలయానికి దక్షిణ భాగంలోని రెండో ప్రాకారం పక్కన ఉన్న మండపంలో స్వామి, అమ్మ వార్లకు నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయంలోని ఉత్సవమూ ర్తులను ఇక్కడకు తీసుకువచ్చి తతంగం పూర్తయిన తర్వాత ప్రధాన ఆల యంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని జరిపిస్తారు. ఈ కార్యక్రమాని కి అమ్మవారి తరపున శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెం దిన గంగవరపు వంశస్తులు, స్వామివారి తరపున దొర్నిపాడు మండలం గుండుపాపుల గ్రామానికి ముక్కామల్ల వంశస్తులు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. ఈ సంప్రదాయం ఆలయం కట్టినప్పటి నుంచి వస్తోంది. ఇంతటి చరిత్ర ఉన్న మంటపాన్ని దేవస్థాన అభివృద్ధిలో భాగంగా గతేడాది సెప్టెంబరులో అధికారులు కూల్చేశారు. దీనిని పునర్నిర్మించేం దుకు మొదట రూ.10 లక్షలు అవుతాయని దేవస్థాన అధికారులు అంచనా వేశారు. ఈ ఖర్చును భరించేందుకు స్వామి, అమ్మవార్ల పెళ్లి పెద్దలు ముందుకు వచ్చారు. ఆ తర్వాత రూ.25 లక్షలు ఖర్చు అవుతాయని దేవస్థాన అధికారులు చెప్పడంతో దాతలు వెనుకడుగు వేశారు. ఆ తర్వాత ఈ మండ పం గురించి అధికారులు అసలు పట్టించుకోవడం మానేశారు. శివరాత్రి పర్వదినం సమీపించాక, మండపం నిర్మాణం చేపడుతున్నా మంటూ కొద్ది రోజుల కిందట పూజా కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపించారు గానీ నిర్మాణాన్ని కనీసం మొదలుపెట్టలేదు. ఇక ఈ ఏడాది నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆ మంటపం స్థానంలో అధి కారులు షామియానా వేశారు. నిర్మించడం చేతగాని అధికారులు అసలు ఎందుకు మంటపాన్ని కూల్చివేశారని భక్తులు ఆగ్రహావేశాలు వెళ్లగక్కు తున్నారు. భూదేవయ్య సత్రాన్ని కూడా గతేడాది మే 29 అర్ధరాత్రి వేళ కూలగొట్టారు. వీరశైవ సంఘం ప్రతినిధులు దేవస్థాన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా కొత్త సత్రం నిర్మించుకునేం దుకు ఆలయ పరిసర ప్రాంతంలోనే స్థలం చూపిస్తా మని వారికి హామీ ఇచ్చారు. ఇక ఇప్పటి వరకు అధికారులు ఆ విషయం కనీసం పట్టించుకోలేదు.



నిశ్చితార్థ మండపం స్థానంలో వేసిన షామియానా

యువతను ముంచిన జగన్

కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్, మార్చి 6: సీఎం జగన్ పచ్చి అబద్ధాలతో నిరుద్యోగ యువతను నిలువునా ముంచేశాడని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ యువ నాయకులు మర్రి మణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమానికి కోట్లతో పాటు ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్, టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి హాజరయ్యారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేస్తానని చెప్పి యువతను వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా.. ఉన్న పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును వైసీపీ ప్రభుత్వం అంధకారం చేశారని అన్నారు. యువతకు జాబ్ రావాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని కావాల్సిందేనని ఆయన అన్నారు. డోన్ నియోజకవర్గ ప్రాంతానికి కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రకటించారు. భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో పేద విద్యార్థులు చదువుకునేందుకు విదేశీ విద్యను అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడిచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, ఆలంకొండ నబీసాహెబ్, ఎస్ఎండీ రఫీ, విజయ కుమార్ రెడ్డి, ఓంప్రకాష్, టీఈ రాఘవేంద్రగౌడు పాల్గొన్నారు.

బీసీల డిక్లరేషన్ చారిత్రాత్మకం: మల్లెల



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 6: టీడీపీ ప్రకటించిన డిక్లరేషన్ చారిత్రాత్మకమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం హుశేనాపురం గ్రామంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పది అంశాలతో బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేయడం శుభ పరిణామమని అన్నారు. సమాజంలో బీసీలకు ఉన్నతమైన గౌరవం తీసుకు రావడానికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకు రానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, నాయకులు వడ్డె నారాయణ, నాగరాజు, కాటినేని నారాయణ, బజారు, కేవీ మధు, జయకృష్ణ, అన్వర్‌బాషా, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎండు మిర్చి ధర పతనం

- క్వింటానికి రూ. 5వేలకు పైగా తగ్గుదల

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 6: ఎండుమిర్చి ధర పడిపోతోంది. గత వారంతో పోల్చితే అన్ని రకాల ఎండు మిర్చి ధరలు తగ్గాయి. క్వింటానికి ఎండు మిర్చి రూ.5వేలకు పైగా ధర తగ్గింది. దీంతో మిర్చిసాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర క్వింటం గరిష్టంగా రూ.16,011 పలికింది. ధరలు పతనం కావడంతో రైతులు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి రకం మిర్చి కనిష్ఠ ధర రూ.5,009, గరిష్ఠ ధర రూ.16,119 కడ్డీ బ్యాడిగి రకం కనిష్ఠ ధర రూ.4,619, గరిష్ఠ ధర రూ.14,619, సిన్జెంటా రకం కనిష్ఠ ధర రూ.5,100, గరిష్ఠ ధర రూ.13,119 పలికాయి. 2043 రకం మిర్చి కనిష్ఠ ధర రూ.4.269, గరిష్ఠ ధర రూ.14219, తేజ రకం కనిష్ఠ ధర రూ.5,000, గరిష్ఠ ధర రూ.12,009 పలికాయి. ఎగుమతులు లేకపోవడంతోనే ధరలు పడిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

అవుకు, మార్చి 6: అవుకు బస్టాండ్ సర్కిల్‌లో ఈనెల 4న పట్టపగలు జరిగిన కుమారి అనే మహిళను హత్య చేసిన ఆమె భర్త పోలక రంగస్వామిని అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ సుబ్బారావు బుధవారం తెలిపారు. అవుకు పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ రంగస్వామి తాగుడుకు బానిసై భార్య కుమారిపై అనుమానం పెంచుకొని హత్య చేశారన్నారు. అడ్డువచ్చిన కుమారి పిన్ని సుబ్బలక్ష్మమ్మను తీవ్రంగా గాయపరిచారని అన్నారు. ప్రస్తుతం ఆమె కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అవుకు సమీపంలోని జమ్మలమ్మ గుడి వద్ద నిందితుడు రంగస్వామిని అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

ఓర్వకల్లు, మార్చి 6: మండలంలోని గుట్టపాడు గ్రామ సమీపాన నూతనంగా నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్ (ఉక్కు పరిశ్రమ) ప్రహరీ పక్కన మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి తడికెల షెడ్లు కాలిపోయాయి. దాదాపు 10 తడికెల షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అందులో బీహార్, ఒరిస్సా, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉక్కు పరిశ్రమలో పని చేస్తూ ఆ షెడ్లలో నివసిస్తున్నారు. సిలిండర్ పేలిన సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షెడ్డులో ఉన్న నిత్యావసర వస్తువులు, కటింగ్ మిషన్లు, పరికరాలు కాలిబూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.5 లక్షల పైగా నష్టం వాటిల్లింది. రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను ఆర్పేశాయి.

ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే దళితులపై దాడులు

- సాయి ప్రసాద్‌రెడ్డిపై ప్రజా సంఘాల ఆరోపణ
- మాదిగ జయమ్మకు మద్దతుగా ఆందోళన



బాధిత మహిళను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, టీడీపీ నాయకుడు భూపాల్ చౌదరి



ఆదోని రూరల్, మార్చి 6 : ఆదోనిలో దళితులు, దళిత మహిళలపై దాడులు పెరిగాయని, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వీటిని ప్రోత్సహిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు, జనసేన నాయకులు ఆరోపించారు. ఆదోనిలోని కల్లుబావికి చెందిన వైసీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి పురుషోత్తంరెడ్డి గత సోమవారం రాత్రి మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన మాదిగ జయమ్మను కులం పేరుతో దూషిస్తూ కొంగుపట్టి లాగి ఇనుప రాడ్‌తో తలపై కొట్టాడు. అడ్డొచ్చిన ఆమె కుమారులపై కూడ చెయ్యి చేసుకున్నాడు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీంతో బీఎస్పీ నాయకులు శాంతరాజ్, సీపీఐ ఎంఎల్ నాయకులు మల్లికార్జున, జనసేన నాయకుడు పులిరాజాతోపాటు దళిత, ప్రజాసంఘాల నాయకులు బాధిత మహిళను పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదోని నియోజకవర్గంలో రోజు రోజుకూ దళితులపై, దళిత మహిళలపై దాడులు పెరిగాయని, వైసీపీ నాయకులు యథేచ్ఛగా దళితులపై దాడులు చేస్తున్నా... స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు తెరవడం లేదని విమర్శించారు. పైగా దళితులపై దాడులను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని, నాగనాథనహళ్ళి ఘటనకు ఎమ్మెల్యే కారణమని అన్నారు. ఈ దాడికి ప్రధాన కారణమైన వైసీపీ నాయకుడు పురుషోత్తంరెడ్డిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాగా పురుషోత్తంరెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసుతోపాటు 320, 324, 354, రెడ్‌విత్ 34, సెక్షన్3(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే గుండమ్మ, కిషోర్, చిన్న ఈరమ్మలపై కూడ కేసు నమోదు చేశామన్నారు.

టీడీపీ నాయకుడు భూపాల్ చౌదరి పరామర్శ : వైసీపీ నాయకుడు పురుషోత్తంరెడ్డి దాడిలో గాయపడి ఆదోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మాదిగ జయమ్మను కర్నూలు టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, జయరాం, లక్ష్మీనారాయణ బుద్ధారెడ్డి పరామర్శించి అండగా ఉంటామన్నారు.

తేజ అపార్ట్‌మెంట్‌లో చోరీ

10 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు అపహరణ

నంద్యాల క్రైం, మార్చి 6: నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్బీఐ కాలనీలో గల తేజ అపార్ట్‌మెంట్‌లో ఓ దొంగ రూ.5 లక్షల నగదు, 10 తులాల బంగారం చోరీ చేశాడు. అపార్ట్‌మెంట్‌లోని 301 నెంబరు గల ప్లాట్‌లో బాలు, భవాని అనే దంపతులు నివసిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దంపతులు ఇద్దరూ షాపింగ్‌కు వెళ్తూ తమ ప్లాట్‌కు తాళం వేసి వెళ్లారు. అంతకుముందే పక్కాగా రెక్కీ నిర్వహించిన ఆగంతకులు అదను కోసం వేచి చూశారు. దంపతులు లిఫ్ట్ దిగి బయటకు వెళ్లగానే ఓ అపరిచిత వ్యక్తి సెల్‌ఫోన్‌లో బిజీగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ గ్రౌండ్ ఫ్లోర్‌లోని వాచ్‌మెన్ భార్య లక్ష్మితో బాలు, భవాని దంపతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా లిఫ్ట్ ఎక్కి 301 ప్లాట్‌కు చేరుకున్నాడు. వెంట తెచ్చుకున్న నకిలీ తాళంతో తలుపులు తీశాడు. నేరుగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లి బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న 10తులాల బంగారం, రూ.5లక్షల నగదును కవర్‌లో చుట్టుకొని లిఫ్ట్ ద్వారా కిందకు దిగి ఉడాయించాడు. అయిదు నిమిషాల్లో షాపింగ్ ముగించుకొని ఇంటికి వచ్చిన బాలు, భవాని దంపతులు జరిగిన దొంగతనాన్ని చూసి నిర్ఘాంతపోయారు. షాక్ నుంచి తేరుకున్న దంపతులు వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని దొంగకు సంబంధించిన ఆధారాలు సేకరించారు. అనంతరం బాలు, భవాని దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగ కోసం గాలిస్తున్నారు.



బాధిత దంపతులు బాలు, భవాని



చోరీ జరిగిన తేజ అపార్ట్‌మెంట్

సంపులో పడి బాలుడు మృతి

- గజ్జెహళ్లి గ్రామంలో ఘటన
- డాక్టర్ అందుబాటులో లేకపోవడపై తల్లిదండ్రుల ఆగ్రహం



బాలుడి మృతికి కారణమైన నీటి సంపు



మృతి చెందిన బాలుడు వినోద్ (ఫైల్)

హొళగుంద, మార్చి 6: నీళ్లు తేవడానికి పోయిన నానమ్మతో పాటు వెళ్లి పక్కింటిలోని సంపులో పడిపోయి ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మల్లికార్జున, నాగమ్మ దంపతులకు ముగ్గురు అబ్బాయిలు సంతానం. మల్లికార్జున తల్లి లక్ష్మి పక్కింటి సంపులో నీరు తెచ్చేందుకు వెళ్లగా చిన్న కుమారుడు వినోద్ (5) కూడా అనుసరించాడు. లక్ష్మి తిరిగి వచ్చాక అక్కడ తోటిపిల్లలతో ఆడుకుంటున్న వినోద్ సంప్‌లోకి తొంగి చూస్తూ అందులో పడిపోయాడు. ఇంటి వద్ద బాలుడు కనిపించక పోవడంతో సంపు వద్ద వెళ్లి చూడగా నీటిలో కొట్టుమిట్టాడుతూ కనిపించాడు. వెంటనే బాలుడ్ని వెలికి తీసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసికెళ్లారు. అక్కడ డాక్టర్లు అందుబాటులో లేరు. కేవలం స్టాఫ్ నర్సులు మాత్రమే ఉన్నారు. వాళ్లు ప్రథమ చికిత్స చేయకుండా ఆదోనికి తీసికెళ్లాలని చెప్పారు. ఆదోనికి వెళ్తుండగా మార్గమధ్యంలో బాలుడు మృతి చెందాడు. ఆస్పత్రిలో డాక్టర్ అందుబాటులో ఉండి ఉంటే బాలుడు బతికేవాడని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ ఎక్కడికి వెళ్లిందీ తెలియదని, అస్పత్రిలో వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండరని గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయంపై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతిని వివరణ కోరగా ఆ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారని, ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడం విచారకరం అన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి డాక్టర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుదాఘాతంతో దుకాణదారుడు మృతి

- బ్లోయర్‌తో శుభ్రం చేస్తుండగా ఘటన

పత్తికొండ, మార్చి 6: పత్తికొండలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా ఫ్యాన్సీ దుకాణం ఏర్పాటు చేసుకున్న వన్నూర్‌బాషా (58) మంగళవారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి గురై మృ తి చెందాడు. మద్దికెరకు చెందిన వన్నూర్‌బాషాకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఫ్యాన్సీ వస్తువులు, గాజుల వ్యాపారం చేసే వన్నూరుబాషా కొద్ది సంవత్సరాల క్రితం మద్దికెర నుండి పత్తికొండ లక్ష్మీనగర్‌కు మారాడు. గ్రామాలలో తిరుగుతూ వ్యాపారం చేయడంతోపాటు తిరుణాలలు, దేవర ఉత్సవాలలో అంగడి ఏర్పాటు చేసుకొని వస్తువులను విక్రయిస్తుంటాడు. అలాగే ఫిబ్రవరి 29న ప్రారంభమైన పత్తికొండ తిరుణాళ్లలో దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. మంగళవారం రాత్రి 11.30కు దుకాణం మూసేశాక బ్లోయర్‌తో వస్తువులపై పడిన దుమ్మును దులిపే పనిలో పడ్డాడు. అయితే బ్లోయర్ వైర్‌కు అతుకు వేసిన టేప్ ఊడిపోయిన విషయం గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్క దుకాణదారులు గమనించేలోగా అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 857 మంది గైర్హాజరు

నంద్యాల టౌన్, మార్చి 6 : జిల్లాలో ఇంటర్ పరీక్షల్లో బుధవారం జరిగిన మొదటి సంవత్సరం వివిధ సబ్జెక్టుల పరీక్షలకు 857 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరిగాయని అన్నారు. జనరల్ విభాగంలో 14,481 మంది విద్యార్థులకు గాను 13,737 మంది హాజరయ్యారని, 744 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 1,321 మంది విద్యార్థులను గాను 1,208 మంది విద్యార్థులు హాజరు కాగా 113 మంది విద్యార్థులు గైర్హాజరాయ్యరని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆమె వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు, మార్చి 6: నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉగ్గన్న(33) అనే వ్యక్తి మృతి చెందారు. కల్లూరు మండలంలోని పందిపాడు గ్రామానికి చెందిన ఉగ్గన్న, ఆయన భార్య లక్ష్మీదేవి కోటప్పకొండలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రాగి ఉంగరాలు, కడియాలు వంటి వ్యాపారం చేసుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. రామయ్యకుంట బేస్ క్యాంప్ సమీపంలోని కానాల బ్రిడ్జి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బొలోరో వాహనం వారి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉగ్గన్న అక్కడికక్కడే మృతిచెందగా లక్ష్మీదేవి స్వల్పగాయాలతో చెట్ల పొదల్లో పడిపోయింది. ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో రైతు..

బనగానపల్లె, మార్చి 6: బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి (50) పంట పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బనగానపల్లె పోలీసులు బుధవారం తెలిపారు. రైతు తన పంట పొలం వద్ద ఉన్న మోటారుకు మరమ్మతు చేసుకుంటూ ఉండగా మోటారుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బ్రహ్మానందరెడ్డి ఎంతకీ ఇంటికి రాకపోవడం, ఫోన్ చేసినా ఫోన్ ఎత్తక పోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లి చూశారు. మృతి చెందిన బ్రహ్మానందరెడ్డిని చూసి విలపించారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారులు బ్రహ్మేశ్వరరెడ్డి, రవితేజారెడ్డి ఫిర్యాదు మేరకు బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టీడీపీ నాయకుడు గ్రామ ఉపసర్పంచ్ బొబ్బల గోపాల్‌రెడ్డి తదితరులు బ్రహ్మానందారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

దళితుల స్థలాలను ఇతరులకెలా ఇస్తారు?

పత్తికొండ, మార్చి 6: మద్దికెర సర్వే నంబర్ 444/2బీలో 4ఎకరాలను గతంలో తమకు కేటాయించారని, ఈ స్థలాలను అధికార పార్టీ నాయకులు వేరే వాళ్లకు ఎట్లా ఇస్తారని మద్దికెర దళితులు బుధవారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు రాఘవేంద్ర తనవెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో పక్కనే ఉన్న వ్యక్తులు అడ్డుకున్నారు. రాఘవేంద్రను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం రాత్రి నాలుగు స్తంభాల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు.

బీసీలంటే బ్యాక్ బోన్ క్లాసెస్ : మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, మార్చి 1: బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాసెస్ అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ బీసీ నాయకులతో కలసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ జయహో బీసీ డిక్లరేషన్‌ను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కులగణన నిర్వహించి చంద్రన్న బీమా రూ.10లక్షలతో పునరుద్ధరిస్తామన్నారు. పెళ్లి కానుకను రూ.లక్షకు పెంచి శాశ్వత కులధృవీకరణ పత్రాలు అందిస్తామన్నారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఏడాదిలో పూర్తిచేస్తామన్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూషణన్న, పట్టణ అధ్యక్షుడు ఖాశీంబాబు, చంద్ర, నరసింహులు, గురప్ప, మంగం పేట శ్రీనివాసులు, బాలనాయుడు, జనసేన నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓంకారంలో శివరాత్రి ఉత్సవాలు

బండిఆత్మకూరు, మార్చి 6: శివరాత్రి ఉత్సవాలు ఓంకారంలో గురువారం రాత్రి నుంచి ఈ నెల 11వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈవో నాగప్రసాద్ తెలిపారు. బుధవారం వారు మాట్లా డుతూ 7వ తేదీ రాత్రి బండిఆత్మకూరులో గంగా, ఉమా సమేత సిద్దేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం, 8వ తేది ఉదయాన్నే బండిఆత్మకూరు నుంచి పల్లకిలో స్వామిని మేళతాళాల వాయిద్యాల నడుమ ఎరుకల కాలనీ, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల మీదుగా ఓంకారం చేరుకుంటారని తెలిపారు. ఆరోజు ఉదయాన్నే స్వామివార్ల మూల విరాట్‌కు గణపతి పూజ, రక్షాబంధనం, ధ్వజారోహణం, సాయంకాలం యాగశాల ప్రవేశం, రాత్రి లింగోద్భవ పూజలు, 9వతేది ఉదయాన్నే కల్యాణం, అదే రోజు సాయంత్రం నందివాహనం స్వామి వార్ల క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తేది సాయంత్రం రథోత్సవం, 11వ తేది ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం తిరిగి పల్లకిలో స్వామి వార్లు బండిఆత్మకూరు చేరుకోవటంతో శివరాత్రి ఉత్సవాలు పూర్తవుతాయనిచెప్పారు. కాశిరెడ్డినాయన, ఆర్యవైశ్య, యాదవ, కాపు, బెస్త సత్రాలలో అన్నదానం నిర్వహిస్తారు.

'జయహో బీసీ'తో వైసీపీలో వణుకు: బుడ్డా



ఆత్మకూరు, మార్చి 6: జయహో బీసీ సభ విజయవంతంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం పేరుతో అందరిని సామాజికంగా మోసం చేసిన వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 10శాతం రిజర్వేషన్ తగ్గించడం వల్ల 16800 మంది బీసీలకు పదవులను దూరం చేశారన్నారు. అసలు సీఎం జగన్‌కు బీసీల గురించి మాట్లాడే అర్హతే లేదని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీల కోసం ఒక్క సంక్షేమ పథకమైనా ప్రవేశపెట్టారా? అని ప్రశ్నించారు. పైగా టీడీపీ హయంలో బీసీల కోసం ప్రవేశపెట్టిన ఆదరణ, పెళ్లి కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేశారని అన్నారు. వైసీపీ హయంలో రూ.75వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించినట్లు వివరించారు. బీసీల పట్ల వివక్ష చూపిన వైసీపీపై బీసీలు వ్యతిరేకంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బీసీలు టీడీపీ, జనసేన పార్టీల వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మంగళగిరి జయహో బీసీ సభ విజయవంతం టీడీపీ, జనసేనలో మరింత ఉత్సాహాన్ని నింపినట్లు చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే బీసీలకు 50ఏళ్లకే పింఛన్లు అమలు చేస్తామని, పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచనున్నట్లు వివరించారు. రూ.10లక్షల బీమా సాయాన్ని అమలుచేస్తామని, చంద్రన్న పెళ్లి కానుకను పునరుద్ధరించి రూ.లక్ష చొప్పున సాయం అందజేస్తామని వివరించారు. లాగే బీసీ ఉప ప్రణాళిక ద్వారా వారి అభివృద్ధికి కేటాయించిన రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు.

రేపు ఏడూర్ల గవిలో ప్రత్యేక పూజలు

గడివేముల, మార్చి 6: మండలంలోని పైబోగుల గ్రామ శివార్లలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఏడూర్ల గవిలోని గంగా ఉమా సమేత సర్వేశ్వర స్వామికి శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహక సభ్యుడు, మాజీ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, అర్చనలు ఉంటాయని అన్నారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. లింగోద్భవ సమయంలో బాబా కాశీనాథ్ మహదానందగిరి స్వామి ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'వేతనాలు వర్తింపజేయాలి'

నంద్యాల టౌన్, మార్చి 6: నంద్యాల మున్సిపాలిటీలో పని చేస్తున్న అర్హులైన కాంట్రాక్టు వర్కర్లకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలను వర్తింపజేయాలని, పనులు నిలిపి వేస్తామని కార్మికులు హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘం కార్యదర్శి భాస్కరాచారి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్ మాట్లాడారు. అనర్హుల వివరాలను ఆప్కాస్‌కు పంపడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

'ప్రతి ఇంటికీ లబ్ధి... టీడీపీ లక్ష్యం'



టీడీపీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల టౌన్, మార్చి 6: ఇంటింటికి సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు మ్యానిఫెస్టోలో సూపర్ -6 పథకాలను పొందుపరిచారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాలను వివరిస్తూ శంఖారావం కిట్లను పంపిణీ చేశారు. 26వ వార్డు ఇన్‌చార్జి పల్లె చిన్న వెంకటసుబ్బయ్య, 27వ వార్డు కౌన్సిలర్ జైనాబీ, మాజీ కౌన్సిలర్ దస్తగిరి, 34 వ వార్డు అహమ్మద్ హుసేన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఫిరోజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కార్మికులను విస్మరించిన ప్రభుత్వం'



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్

పగిడ్యాల, మార్చి 6: కార్మికుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన చట్టాలను వైసీపీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసిందని, కార్మిక చట్టాలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. పగిడ్యాలలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వ ర్యంలో బుదవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మి కులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న సంక్షేమ చట్టాలను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడంతో కార్మికుల జీవన పరిస్థితి దుర్భరంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి ఐదు ఏళ్లు కావస్తున్న కార్మికులను ఆదుకోవడంతో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియపై అవగాహన ఉండాలి: కలెక్టర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మార్చి 6: నామినేషన్ల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, పోటీ చేసే అభ్యర్థులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డా. శ్రీనివాసులు సూచించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల్లో ఏం చేయాలి? ఏం చేయకూడదు? అన్న అంశాలపై పూర్తి స్పష్టత ఉండాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకూడదన్నారు. నామినేషన్ ప్రక్రియ గురించి అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. సంబంధిత ఆర్వో ముందుగానే చెక్ చేసుకోవాలని, ఏవైనా వివరాలు అవసరమైతే సమాచారం అందిస్తామని చెప్పారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై సంబంధిత రిటర్నింగ్ అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకొని ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

'డిక్లరేషన్‌తో బీసీల్లో ఉత్సాహం'



పాణ్యంలో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

పాణ్యం, మార్చి 6: టీడీపీ, జనసేన సంయుక్తంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌తో బీసీ వర్గాల్లో ఉత్సాహం నింపిందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ నాయుడు అన్నారు. పాణ్యంలోని టీడీపీ కార్యాల యంలో బుధవారం బీసీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ ప్రణాళిక ద్వారా ఐదేళ్లలో బీసీల కోసం లక్షన్నర కోట్లు సబ్‌ప్లాన్ నిధులు వినియోగించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణ, నామినేటెడ్ పదవులు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, పింఛన్ రూ.4 వేలకు పెంపు, ప్రత్యేక రక్షణ చట్టం, పెళ్లి కానుక వంటి పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. తెలిపారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



కంబాలపల్లెలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పాములపాడు, మార్చి 6: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని, చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మండలంలోని కంబాలపల్లె గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ మండల సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఒక్క చాన్స్ అంటూ ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని వివరించారు. మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగుల కోసం పథకాలు అమలు చేస్తారన్నారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్, గోవిందు, లక్ష్మీకాంతరెడ్డి, పూసల కృష్ణ, హఫీజ్, సత్యం రెడ్డి, యేసేపు, శివరామయ్య, బండశేఖర్, స్వాములు, మల్లీశ్వరరెడ్డి, పాపిరెడ్డి, శివ, లక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు. రంగస్వామిగౌడ్, సుంకిరెడ్డి, అలీసాహెబ్, కృష్ణ, రాముడు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'పేదలకు పట్టాలు ఇవ్వాలి'

నందికొట్కూరు, మార్చి 6: పట్టణంలోని వీఆర్ఆర్ కాలనీలో పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, ఆ స్థలాలు పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం వీఆర్ఆర్. గుడిసెవాసుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఎం. కర్ణ, ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, బాలయ్య, నాగేశమ్మ, ఏసేపు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

పాములపాడు, మార్చి 6: పాములపాడులోని ఎరువుల దుకాణాలను ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ బుధవారం తనిఖీ చేశారు. గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర, మన గ్రోమోరు తదితర ఎరువుల దుకాణాలలో స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రికార్డులలోన ఉన్న ఎరువులు గోడౌన్‌లలో నిల్వలను పరిశీలించారు. అనుమతులు కల్గిన గోడౌన్లలోనే ఫర్టిలైజర్స్ నిల్వ చేయాలని. అనుమతులు కల్గిన ఎరువులను మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మకూడదని ఆదేశించారు. అనుమతులు లేని బయో ఉత్పత్తులు విక్రయించకూడదని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం'

గోస్పాడు, మార్చి 6: వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యమని బీజేపీ నంద్యాల అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. బుధవారం గోస్పాడులో బీజేపీ మండల కార్యాలయాన్ని అభిరుచి మధు, మండల కన్వీనర్ మధుగోపాల్ ప్రారంభించారు. మధు మాట్లాడుతూ శిల్పా కుటుంబం 20 ఏళ్ళుగా అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తాడి రామకృష్ణ, నంద్యాల పట్టణ అధ్యక్షుడు కశెట్టి చంద్రశేఖర్, మహిళా మోర్చా నాయకురాలు స్వాతి, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ రంగులు వేయడం సరికాదు'



ధర్నా చేస్తున్న ముస్లింలు

నంద్యాల టౌన్, మార్చి 6: నంద్యాల పట్టణంలో మున్సిపల్ కార్యా లయం ఎదురుగా స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను కించపరిచే విధంగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్థూపానికి వైసీపీ రంగులు వేయడం, శిల్పా పేరును పెట్టడం తగదని ముస్లిం ఫెడరేషన్ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం స్థూపం ఎదుట ధర్నా చేశారు. ఫెడరేషన్ నాయకులు బాబాఫక్రుద్దీన్, సలాం, సోహెల్ రాణా, మహబూబ్‌బాషా, సద్దాం, నూర్‌బాషా, తదితరులు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అబుల్ కలాం సర్కిల్‌గా ఉన్న ప్రాంతాన్ని మళ్లీ సర్కిల్ పేరుతో నామకరణం చేస్తున్నామంటూ కొత్తగా స్థూపం నిర్మించి తన పేరును, వైసీపీ రంగులను వేసి రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. వెంటనే శిల్పా పేరును, వైసీపీ రంగులను తొలగించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'నిరంతర సాధనతోనే ప్రతిభకు మెరుగు'

పాణ్యం, మార్చి 6: నిరంతర సాధనతోనే ప్రతిభ మెరుగు పడుతుందని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి అన్నారు. జాతీయ ఫార్మసీ ఎడ్యుకేషన్ దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో వీడియో మేకింగ్ ప్రోగ్రాంలో పాల్గొని తమ ఆవిష్కరణలను వీడియోల రూపంలో పొందుపరిచారు. ఎడ్యుకేషన్ పాలసీపై అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జిందాల్' ఆధ్వర్యంలో మరుగుదొడ్ల ఏర్పాటు



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఈవో, జిందాల్ కంపెనీ ప్రతినిధులు

మహానంది, మార్చి 6: మహానంది శైవక్షేత్రంలో బుధవారం భక్తులకు వసతి కల్పనలో భాగంగా జిందాల్ సంస్థ రూ. 40 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి జిందాల్ సంస్థ ప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. అత్యాధునికంగా నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్లను శివరాత్రి వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగపడతాయని ఈవో చెప్పారు.

9న రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

మహానంది, మార్చి 6: మహానంది శైవక్షేత్రంలో ఈ నెల 9న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం రైతు కమిటీ సభ్యులు మహానంది ఎద్దుల పోటీల క్రీడా మైదానంలో బల ప్రదర్శన పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.లక్షలాది రూపాయలు ఎద్దుల యజమానులకు ఇవ్వనున్నట్లు రైతు కమిటీ సభ్యులు కొమ్మా మహేశ్వరరెడ్డి, కందుల రఘురామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందులో సీనియర్స్ సబ్‌జూనియర్స్ న్యూ కాటగిరి విభాగంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు చేప్పారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 8గంటలకు పందేలలో పాల్గొనే సీనియర్ ఎద్దుల జతతో ఎద్దుల యజమానులు హాజరుకావాలని కమిటీ సభ్యులు తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

గడివేముల, మార్చి 6: మండలంలోని జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు మంజూరైన వారికి బుధవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మండలంలోని 8 గ్రామాలకు గాను 1,631 పట్టాలను పంపిణీ చేశారు. జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీడీవో శివరామిరెడ్డి, తహసీల్దార్ జమానుల్లాఖాన్, మండల అధికారులు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్‌తో వడ్డెరలకు భరోసా'

గడివేముల, మార్చి 6: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జయహో బీసీ కార్యక్రమంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వడ్డెరల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అఖిలభారత వడ్డెర ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బీవీఎన్ రాజు అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరే షన్‌లో వడ్డెరల వృత్తి పని చేసే వారికి 50 ఏళ్లకు పింఛన్, క్వారిలో రిజర్వే షన్, ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం, వడ్డె ఓబన్న జయం తిని అధికారికంగా నిర్వహిస్తామని తీర్మానించడం హర్షణీయమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఆత్మకూరు రూరల్, మార్చి 6: ఆత్మకూరు మండలం కరివేన గ్రామ శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ అనే వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. బుధవారం ఎస్ఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కరివేన గ్రామ సమీపంలో బైక్‌పై వెళుతున్న శ్రీనివాస్ అదుపు తప్పి కింద పడి పోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108లో క్షతగాత్రుడ్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వ్యక్తిని కర్నూలుకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ వెల్లడించారు.

గోవా మద్యం పట్టివేత

వెలుగోడు, మార్చి 6: వెలుగోడు పట్టణంలో గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాలివి.. పట్టణంలోని చెంచు కాలనీకి చెందిన గండికోట రామచంద్రయ్య, షేక్ మాబున్నిసా గోవా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులతో దాడిచేసి 24 ఫుల్, 29 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దుకాణదారులపై కేసులు

శ్రీశైలం, మార్చి 6: శ్రీశైలం దేవస్థానంలోని పందొమ్మిది దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదయ్యాయి. శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నంద్యాల ఎస్పీ ఆదేశాల మేరకు లీగల్ అండ్ మెట్రాలజీ డిపార్మెంట్ అధికారులతో కలిసి క్షేత్ర పరిధిలో భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. పంతొమ్మిది దుకాణాల నిర్వాహకులపై కేసు నమోదు చేసి రూ.77 వేలు జరిమానా విధించారు.

కానాలపల్లెలో వైద్య శిబిరం

గోస్పాడు, మార్చి 6: గోస్పాడు మండలం కానాలపల్లె గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం మహానంది వ్యవసాయ కళాశాల 4వ సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవా పథకం నిర్వహణలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ గోపాల్, సిబ్బంది కానాలపల్లె గ్రామస్థులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలను కూడా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ అధ్యాపకురాలు డాక్టర్ కవిత, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భూసార పరీక్ష కోసం 21 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు, నీటి నమూనాలను సేకరించి భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి సంతోష్‌కుమార్ నాయక్, డాక్టర్ సరోజినీదేవి, సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

ఆత్మకూరు, మార్చి 6: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలుచేసే వారికే తమ ఓట్లు ఉంటాయని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓటు ఫర్ ఓపీఎస్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేస్తానని చెప్పిన సీఎం జగన్ ఇంతవరకు పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు. నాయకులు జాకీర్, సాయిప్రసాద్, బొజ్జయ్య, రఘుస్వామి, లోకేంద్ర, రమణ, ప్రభాకర్, కలిముల్లా తదితరులు ఉన్నారు.

'పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి'

ఆత్మకూరు, మార్చి 6: పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని శ్రీశైలం నియోజకవర్గం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి అన్నారు. మండలంలోని బాపనంతాపురం, నల్లకాల్వ, కొత్తరామాపురం, ముష్టేపల్లి, సిద్ధేపల్లి, పెద్దఅనంతాపురం గ్రామాలతో పాటు ఆత్మకూరులోని ఇస్లాంపేట పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. అలాగే కరివేన సమీపంలోని డిపాల్ హైస్కూల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆత్మకూరు తహసీల్దార్ కే.బాబు, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, వీఆర్వో శంకరరెడ్డి ఉన్నారు.

'లింగ నిర్ధారణ నేరం'



మాట్లాడుతున్న ఆత్మకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి

ఆత్మకూరు, మార్చి 6: లింగనిర్ధారణకు పాల్పడటం చట్టరీత్యా నేరమని ఆత్మకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆశాకార్యకర్తలు, అంగన్ వాడీలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధాణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో యాక్ట్ లాంటి చట్టాలు ఉన్నాయని హెచ్చరించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వాటిని ప్రోత్సహించిన వారు కూడా బాధ్యులేనని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఆత్మకూరు, నందికొట్కూరు ఐసీడీఎస్ సీడీపీవోలు లీలావతి. కోటేశ్వరి, ఆత్మకూరు, గోకవరం ఆసుపత్రుల వైద్యాధికారులు రాయుడు, జుబేదాబేగం, అడ్వకేట్స్ శ్రీధర్‌అడిగ, సుదర్శన్, మాణిక్యరావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు

నందికొట్కూరు, మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శ్రీశైలం, భోగేశ్వరం దేవస్థానాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు నందికొట్కూరు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. నందికొట్కూరు డిపో నుంచి శ్రీశైలానికి 30 ప్రత్యేక బస్సులు, అలాగే భోగేశ్వరానికి 2 స్పెషల్ బస్సులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

రేపు మహిళా దినోత్సవం

నందికొట్కూరు, మార్చి 6: ఈనెల 8న జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ ఆవరణలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని విడుదల చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఆర్ శివ, ఐఎఫ్‌టీయూ నాయకులు గోవిందు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'

నందికొట్కూరు, మార్చి 6: మిడ్తూరు మండలం దేవనూరు గ్రామంలో తలెత్తిన తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ సచివాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులు ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిడ్తూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రెండు నెలలు అవుతున్నా కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. గ్రామంలో రెండు ట్యాంకులు ఉన్నా నీరు సరిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేసవికాలం రాకముందే అధికారులు సమ్మర్ స్టోరేజీలను నింపుకొని గ్రామానికి సరిపడా నీటిని నిల్వ చేయాలనే ఆలోచన ప్రజాప్రతినిధులకు, అధికారులకు లేదన్నారు. తక్షణమే కొత్తగా బోర్లు వేయించి గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్యను తీర్చాలన్నారు. మిడ్తూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా రైతులకు నిధులు విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న, పత్తి, మిరప, ఉల్లి, కొర్ర, కంది తదితర పంటల్లో పూర్తిగా వర్షాల్లేక ఎండిపోయాయన్నారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రబీలో శనగ విత్తనాలు వేసిన తర్వాత వర్షం లేకపోవడంతో శనగ పంట ఎకరాకు రెండు క్వింటాలు కూడా దిగుబడి రాలేదన్నారు. అందువలన శనగ రైతులను కూడా పరిగణనలోకి తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని సచివాలయ సిబ్బంది వీఆర్వో సోఫీ సాహెబ్, అడ్మిన్ మహేష్ బాబు, మహిళా పోలీస్ అరుణకుమారికి అందజేశారు. వి.నాగరాజు, వెంకటస్వామి, రామకృష్ణ, నాగేంద్రయ్య, బాలరంగయ్య, పుష్పావతి, రాజమ్మ, మద్దమ్మ, చెంచమ్మ, లక్ష్మమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి శివభక్తులు

కొత్తపల్లి, మార్చి 6: కొత్తపల్లికి చెందిన సుమారు వంద మంది శివస్వాములు శివనామస్మరణ చేసుకుంటూ బుధవారం శ్రీశైలం మల్లన్న చెంతకు పాదయాత్రగా బయలుదేరారు. 41 రోజులుగా దీక్షలో ఉన్న శివస్వాములు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇరుముడులు సమర్పించేందుకు బయలుదేరి వెళ్లారు. బస్టాండు సెంటరులో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు లక్ష్మీనరసయ్యశర్మ శివ స్వాములతో శివునికి క్షీరాభిషేకం, తదదితర విశేష పూజలు చేయించారు. అనంతరం శివస్వాములకు ఇరుముడులు కట్టి గ్రామ శివారు వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య ఊరేగింపుగా ఘనంగా వెళ్లారు.

మజ్జిగ పంపిణీ

ఆత్మకూరు రూరల్, మార్చి 6: శ్రీశైలానికి కాలినడకన పాదయాత్రగా తరలివస్తున్న శివభక్తుల కోసం బుధవారం ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఏబీఎం మధుసూదన్, ఏవో ఉమాశంకర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. వెంకటాపురం గ్రామంలో పంపిణీ చేశారు. ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఫొటోగ్రాఫర్‌ను చంపిన వారిని శిక్షించాలి'



ర్యాలీ చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు

నందికొట్కూరు, మార్చి 6: విశాఖపట్టణంలో ఫొటోగ్రాఫర్‌ను అత్యంత దారుణంగా హత్యకు చేసిన వారిని వెంటనే శిక్షించాలని నందికొట్కూరు ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు పట్టణంలో నిరసన ర్యాలీని చేపట్టారు. విశాఖకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి విజయ్ పవన్ కళ్యాణ్(23) వద్ద ఉన్న ఖరీదైన కెమెరాను తీసుకునేందుకు ఇద్దరు వ్యక్తులు షూటింగ్ ఉందని నమ్మించి అత్యంత కిరాతకంగా హత్య చేయడం దారుణ మన్నారు. యూనియన్ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



నందికొట్కూరులో రోడ్డుపై వృథాగా పారుతున్న తాగునీరు

నందికొట్కూరు, మార్చి 6: నందికొట్కూరు పట్టణంలో రెండు రోజుల నుంచి రోడ్డుపై తాగునీరు వృథాగా పారుతోంది. పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న ప్రధాన నీళ్ల ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైన్ పగిలిపోయింది. రెండు రోజుల నుంచి నీరు వృథా అవుతోందని, అధికారులు, సిబ్బందికి చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. తాగునీటి సమస్యతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని, అయితే ఇలా తాగునీరు వృథా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బుగ్గన శేషారెడ్డి విగ్రహ ఏర్పాటును విరమించుకోవాలి



డోన్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

డోన్(రూరల్), మార్చి 6: రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి జేజినాయన బుగ్గన శేషారెడ్డి విగ్రహ ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డోన్‌లో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ వద్ద బుగ్గన శేషారెడ్డి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని, వీటి ఏర్పాటు జరిగితే, వాటిని అడ్డగిస్తామని హెచ్చరించారు. బుగ్గన శేషారెడ్డి విగ్రహ స్థానంలో భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బహిరంగ వేలం నిర్వహించాలి

డోన్(రూరల్), మార్చి 6: డోన్ పట్టణం పాతబస్టాండు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ షాపులకు బహిరంగ వేలాలు వేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి డోన్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. హేమసుందర్ రెడ్డి మాట్లాడుతూ డోన్ కూరగాయల మార్కెట్ షాపులను లక్కీ డిప్ ద్వారా కేటాయించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. లక్కిడిప్ పద్ధతి పెట్టడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయ నాయకులకు లబ్ధి చేకూర్చడం కోసమే ఈ లక్కీ డిప్ పద్ధతి పెట్టినట్లు తెలుస్తుందని ఆరోపించారు. ఈ పద్ధతిని వెనక్కి తీసుకుని షాపులకు బహిరంగ వేలాలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డబ్బాల దేవేంద్రుడు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడసారి శివ శంకర్, మాజీ జిల్లా కార్యదర్శి రామచంద్ర నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రాచారి, రిటైర్డు ఆర్మీ బలరాముడు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 6: ఆపదలో ఉన్న వారికి ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆపన్నహస్తాన్ని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం అందించారు. బనగానపల్లెలోని కరీంబాగ్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ ఇద్రుస్‌బాషా తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ సభ్యులు



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు

బనగానపల్లె, మార్చి 1 : బనగానపల్లె బార్ అసోసియేషన్‌కు నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖాజా హుసేన్ సాహెబ్, ఉపాధ్యక్షురాలిగా మల్లెతుల ఈశ్వరమ్మ, జనరల్ సెక్రటరీగా జేమ్స్, జాయింట్ సెక్రటరీగా అల్లావుద్దీన్, ట్రెజరర్‌గా మండ్ల రఘురామిరెడ్డి, లైబ్రరీగా దస్తగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ న్యాయవాదులు పరశురామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యూసుఫ్‌హుసేన్, అబ్దుల్‌ఖైర్, జగన్నాథరెడ్డి, అజాంహుసేన్, బాబావలి, బాస్కర్, అఖిల్, విక్రమ్‌సింహారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికి మాతృవియోగం



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, మార్చి 6: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ తల్లి లక్ష్మీదేవి (65) అనారోగ్యంతో బుధవారం స్వగ్రామం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో మృతి చెందారు. మాజీ కేంద్ర మంత్రి కోట్ల ప్రకాష్ రెడ్డి, టీడీపీ పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, కోట్ల రాఘవేంద్రరెడ్డి, లక్కసాగరం లక్ష్మీరెడ్డి, వలసల రామక్రిష్ణ, టి శ్రీనివాసులు, కేశన్నగౌడు, ఆదర్శ విద్యాసంస్థల అధినేత తిమ్మయ్య, నాయకులు, యాదవ సంఘం నేతలు లక్ష్మీదేవి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

గంగ ప్రధాన కాలువకు నీటి విడుదల

రుద్రవరం, మార్చి 6: నంద్యాల జిల్లా ప్రజలకు తాగునీటిని దృష్టిలో ఉంచుకుని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తెలుగు గంగ ప్రధాన కాలువకు 1500 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణయ్య బుధవారం తెలిపారు. 22 బ్లాక్ చానళ్ల తూములను షట్‌డౌన్ చేసి తుండ్లవాగు రిజర్వాయర్ నింపుతున్నామన్నారు. 7వతేదీ నుంచి బ్లాక్ చానళ్లకు నీటిని విడుదల చేసి ఆయా బ్లాక్ చానళ్ల పరిధిలోని చెరువులకు నింపుతామన్నారు. వీటి ద్వారా పశువులకు దాహార్తి తీర్చనున్నట్లు తెలిపారు. 7, 8 తేదీల్లో నీటి సామర్థ్యాన్ని తగ్గించి కాల్వలకు నీటి విడుదల చేస్తామన్నారు. నంద్యాల, వెలుగోడు, ఆత్మకూరు తాగునీటి సౌకర్యార్థం వెలుగోడులో 1.5 టీఎంసీలు నీటిని నిల్వ ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ నీరు జూన్, జూలై వరకు తాగునీటి సౌకర్యార్థం అందిస్తామని చెప్పారు. ప్రతి తూము వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి తుండ్లవాగు రిజర్వాయరును నింపామన్నారు. ఆయన వెంట ఈఈలు శంకర్‌రెడ్డి, రాజశేఖర్, డీఈలు రఘురామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, రవీంద్ర, ఏఈ రామశేష తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

బేతంచెర్ల, మార్చి 6: మండలంలోని పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన పాపసాని రామతిమ్మారెడ్డి ఆయన భార్య లక్ష్మీదేవిని పొలం రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు భార్యాభర్తలను కొట్టి గాయపరిచారని హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప బుధవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వివరాల మేరకు రామతిమ్మారెడ్డి లక్ష్మీదేవి భార్యాభర్తలు పొలం దగ్గర ఉండగా.. రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, వెంకట తిమ్మారెడ్డి పొలం వద్ద వారిని కొట్టి గాయపరిచారని తెలిపారు. గాయపడిన భార్యాభర్తలను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు మృతికి బీసీ ఇందిరమ్మ నివాళి



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 6: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. బ్రహ్మానందారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు.

సీఎంను గద్దె దింపేద్దాం: టీడీపీ



కోవెలకుంట్లలో సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 6: సీఎం జగన్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని అంకాలమ్మ వీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకంలో భాగంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ ప్రజలు గుక్కెడు నీటికోసం అల్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పట్టించుకోవడం లేదన్నారు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, స్వామినగర్ తదితర కాలనీల్లో ప్రజలు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, తాగునీరు ఇవ్వడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. ఒక్క చాన్సు అని నమ్మి అధికారం ఇచ్చినందుకు ప్రజలను సీఎం నిండా ముంచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గువ్వలసుబ్బారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, బీవీ.ప్రసాద్‌రెడ్డి, బిజనవేముల హుసేనయ్య, గడ్డం అమర్‌నాథ్‌రెడ్డి, లాయర్ శ్రీకాంత్, లాయర్ అల్లీహుసేన్, పెనుగొండ రాజశేఖర్, కులాయి, టైలర్ అహమ్మద్ హుసేన్‌లతో పాటు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నెలో బుధవారం వైసీపీకి భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన జలాలీసన్న ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ టీడీపీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ నాయకులు జలాలీసన్న, యూత్ లీడర్ జలాలి భాష, నడిపిహుసేన్, పసుపుల దస్తగిరి, అల్లూరు దస్తగిరి, షరీఫ్, అవుకు బాబాఫక్రుద్దీన్, మహబూబ్‌హుసేన్, మద్దె అక్బర్, అవుకు బాబు, ఆవుల శివ, గంటాబాలయ్య, ఆల్వకొండ పకీనా, వంటి స్థానిక వైసీపీ నాయకులతో పాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో సౌదరదిన్నె సుబ్బారెడ్డి, పొట్టిపాడు సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి, డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, లాయర్ అల్లీహుసేన్, లాయర్ శ్రీకాంత్, బిజనవేముల హుసేనయ్య, మనోహర్, సౌదరదిన్నె దస్తగిరి, టంగుటూరు శ్రీనయ్య, లాయర్ నాగేంద్రారెడ్డి, వెలగటూరు ధనుంజయుడు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

● మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

దొర్నిపాడు, మార్చి 6: రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, రాక్షస పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని డబ్ల్యూ. కొత్తపల్లె గ్రామంలో బుధవారంబాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో వైసీపీ పాలన సాగించిందని, ఆ పార్టీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ అభిలాష్‌రెడ్డి, భూమా సందీఎరెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, భూమా రమేష్‌రెడ్డి, ఏరువ ప్రసాదరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రామచంద్రాపురం దయానందరావు పాల్గొన్నారు.

'వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత'

ఆళ్లగడ్డ, మార్చి 6: వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వారి స్వగృహంలో బుధవారం రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన మాలేపాటి నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, బాలనాగిరెడ్డితో పాటు 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ముత్తలూరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, బాల మోహన్, వెంకటరాముడు ఉన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

దొర్నిపాడు మార్చి 6: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండలంలోని చాకరాజు వేముల గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, గంగవరం కృష్ణారెడ్డి, డీలర్ మోహన్‌నాయుడు, జగదీశ్వర్‌నాయుడు, డీలర్ హబీబ్‌బాషా, కొత్తపల్లి సురేంద్ర, చక్రవర్తినాయుడు, దయానందరావు, సిద్ధి సత్యం, సిద్ధి నారాయణ, మాజీ సర్పంచ్‌లు దస్తగిరి, నాగన్న, నాయన గారి శ్రీనివాసులు పాల్గొన్నారు.



డబ్ల్యూ.కొత్తపల్లెలో మహిళలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



చాకరాజువేములలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి



టీడీపీలో చేరిన ముత్తలూరు గ్రామస్థులతో భార్గవ్‌రామ్‌నాయుడు

చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం



సమావేశంలో టీడీపీ నాయకులు

డోన్, మార్చి 6: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జయహో బీసీ వేదిక పై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. జగన్‌పై 300 మందికిపైగా బీసీలను దారుణంగా హత్యకు గురయ్యారన్నారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తానని చంద్రబాబు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్‌ను అమలు చేసి నెలకు రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చి బీసీలకు చేయూతనిచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.75వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిందని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్‌ప్లాన్ నిధులను బీసీల కోసమే వినియోగించేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ నాయకులు ఆర్ఈ నాగరాజు, టీఈ రాఘవేందరగౌడు, గోసానిపల్లి మల్లయ్య, రామదుర్గం జయరాముడు, చనుగొండ్ల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.16.18 లక్షల ఆదాయం



శిరివెళ్లలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల, మార్చి 6: శిరివెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్‌లలో 2024-25 సంవత్సరానికి గాను రుసుములు వసూలు చేసుకునే హక్కును పొందేందుకు నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా రూ.16.18 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవోపీఆర్డీ నాగేంద్ర బుధవారం తెలిపారు. ఇందులో వారపు సంతకు రూ.8.68 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.7 లక్షలు, కబేళాకు రూ.50 వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. 2023-24 సంవత్సరానికి గ్రామ పంచాయతీకి వీటి ద్వారా రూ.17.45 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.1.27 లక్షల ఆదాయం తగ్గి రూ.16.18 లక్షలు వచ్చిందన్నారు. డీపీవో కార్యాలయ ఏవో గంగాధర్ పర్యవేక్షణలో ఈ వేలంపాటలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కాకుల సాలమ్మ, ఉప సర్పంచ్ షేక్ ఇంతియాజ్, సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ నవీన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ధర్మప్రచారం అందరి బాధ్యత'



చాగలమర్రిలో ధర్మరక్ష నిధిపత్రాలు అందజేస్తున్న నాయకులు

చాగలమర్రి, మార్చి 6: ధర్మప్రచారం అందరి బాధ్యతని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ సల్లా నాగరాజు అన్నారు. బుధవారం ఎస్ఎస్ఎఫ్ సభ్యుల ఆధ్వర్యంలో ధర్మరక్ష-ధర్మనిధి సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందువులతో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడాలని సూచించారు. ధర్మరక్ష నిధి సభ్యత్వాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందూ సంఘం నాయకులు గుత్తి నరసింహులు, రఘురామ్ పాల్గొన్నారు.

'పండ్ల తోటల సాగు లాభదాయకం'

చాగలమర్రి, మార్చి 6: గ్రామాల్లో రైతులు పండ్ల తోటల సాగు వల్ల లాభదాయకంగా ఉంటుందని ఉపాధిహామీ ఏపీవో నిర్మల సూచించారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ ఈ ఏడాది 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు లక్ష్యం ఉందన్నారు. ఉపాధిహామీ సిబ్బంది పండ్ల తోటలు సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల పాటు ఉపాధి హామీ నిధులు మంజూరు చేస్తామన్నారు. కూలీలకు గ్రామాల్లో వంద రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుపై సామాజిక తనిఖీ

చాగలమర్రి, మార్చి 6: మండలంలోని 17 ఆర్‌బీకే కేంద్రాల్లో ఈక్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం మూడవ ఆర్‌బీకే కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. 99 శాతం మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. సున్నా వడ్డీ కింద ఖరీఫ్‌లో 257 మంది రైతులకు 7.72 లక్షలు, రబీ సీజన్‌లో 803 మంది రైతులకు 17.50 లక్షలు మంజూరైందని ఏవో వివరించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

దొర్నిపాడు, మార్చి 6: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె, డబ్ల్యూకొత్తపల్లి, చాకరాజువేముల, దొర్నిపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి ఆరా తీశారు. ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు పాల్పడవద్దని ఆదేశించారు. గ్రామాల్లో నాటుసార విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. చాకరాజువేముల, డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామాల్లో జరుగుతున్న మరుగుదొడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్ఐ సురేష్, మండల సర్వేయర్ మల్లయ్య, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలను మోసగించిన వైసీపీ'



యర్రగుంట్లలో మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, మార్చి 6: వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని, ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమేయాలని యర్రగుంట్ల ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, కమతం లక్ష్మీరెడ్డి, కమతం పుల్లారెడ్డి, బీసీ సెల్ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం లక్ష్మీప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలోని 112, 116, 121 బూత్‌లలో పర్యటించి మేనిఫెస్టో పత్రాలను బుధవారం ప్రజలకు అందజేశారు. స్వయం సహాయక సంఘాలు, ఆదరణ పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ఎనలేని కృషి చేసిందన్నారు. టీడీపీతోనే మహిళా సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో కమతం సుబ్బారెడ్డి, తాళ్లూరి బుగ్గన్న, తపసి ఆంజనేయులు, కమతం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'



చాగలమర్రిలో సూపర్-6 పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు పిలుపునిచ్చారు. చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండు సమీపంలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్-6 కరపత్రాలను అందజేశారు. టీడీపీ మేనిఫెస్టో గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. నరసింహులు మాట్లాడుతూ రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మక్బూల్, రామకృష్ణ, నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే గ్రామ పంచాయతీలు బలోపేతం'



మోత్కలపల్లెలో ప్రచారంలో టీడీపీ నాయకులు

శిరివెళ్ల: టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు బలోపేతమవుతాయని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, మోత్కలపల్లె గ్రామ సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టోతో కూడిన పోస్టర్‌ను మోత్కలపల్లె గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. పంచాయతీల నిధులను అడ్డగోలుగా దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని విస్మరించిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలూరి శివరామిరెడ్డి, రఘునాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, నాగార్జునరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, గిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాపై అవగాహన

చాగలమర్రి, మార్చి 6: చాగలమర్రి గ్రామంలోని సేయింట్‌ఆన్స్ ఇంగ్లీషుమీడియం ఉన్నత పాఠశాల, ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో, ఎంఈవో, పీఎస్సీ కార్యాలయాల్లోని అధికారులకు తపాలా జీవిత బీమాపై చాగలర్రి పోస్టల్ అధికారి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. జీవిత బీమా పత్రాలను ఆయా శాఖల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శోభావివేకవతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన జగన్



టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

బేతంచెర్ల, మార్చి 6: వైసీపీ అరాచక పాలనలో రైతులను నమ్మించి నట్టేట ముంచిన జగన్ రెడ్డి పాలనకు ప్రజలు, రైతులు స్వస్తి పలికి చంద్రన్న పాలనకు ప్రజలు స్వాగతం పలకాలని డోన్ టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నాయకులు సీపీ రాముడు, ఉరుకుందు, వాసు, చంద్ర, సుభాని, ఆధ్వర్యంలో మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలనను కొనసాగిస్తున్న పిచ్చి తుగ్లక్ జగన్ రెడ్డి పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, జాకీరుల్లా భేగ్, బుగ్గన ఆనందరెడ్డి, రవీంద్ర నాయక్, శ్రీనివాసు యాదవ్, నాగరాజు, రామాంజనేయులు, గూటుపల్లె ముల్లా, ఫయాజ్, నిజాంగారి రామనాథం, అరుణ్ కుమార్, చంద్ర, కేవీ సుబ్బారెడ్డి, గూటం శివ, మధులోకేశ్వరరెడ్డి, పుట్టపాశం వెంకటేశ్వర్లు, మురళి, ఎంఎస్, ఖాజా హుసేన్, జనసేన నాయకులు శ్రీకంటి మధు, బుక్కాపురం లక్ష్మన్న, రాధాకృష్ణ, కానాల అంజి, దూదేకుల దస్తగిరి, మంచినీళ్ల సుమంత్, జగదీష్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



నల్లవాగుపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రుద్రవరం, మార్చి 6: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీ పీ నాయకులు పార్థసారధిరెడ్డి అన్నారు. మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బాబు సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వచ్చేది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని అన్నారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'

చాగలమర్రి, మార్చి 6: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. కొత్తగా వెటర్నరీ ఉద్యోగులుగా ఎంపికైన నవీన్‌కుమార్, ప్రవీన్‌కుమార్‌ను బుధవారం ముత్యాలపాడు బస్టాండులోని బీసీ సంఘం కార్యాలయంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంఘం నాయకులు బాలబుజ్జి, నరసింహులు, దస్తగిరి, శ్రీనివాసులు, లోకేష్, చిన్ని కృష్ణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, మార్చి 6: పట్టణ శివారులోని అయ్యలచెరువు ప్రాంతంలో ఉన్న మన్సూర్ బండల ఫ్యాక్టరీలో జార్ఖండ్‌కు చెందిన పరవ్‌సోరన్ (26) అనే వ్యక్తికి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికంగా పరవ్‌సోరన్‌కు ఎవరూ లేకపోవడంతో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వనూరుబాషాను స్థానికులు కోరారు. ఆయన బేతంచెర్ల పోలీసుల ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో శ్మశాన వాటికలో పరవ్‌సోరన్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మీరాఘవ, యూసుఫ్, అక్బర్, మాబాషా, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అహోబిలం బ్రహ్మోత్సవాలకు రండి



రేంజ్ ఐజీ ఆవుల వెంకటరంగనాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ, మార్చి 6: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని వరంగల్ రేంజ్ ఐజీ ఆవుల వెంకటరంగనాథ్‌ను అహోబిలం కాపు బలిజ నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ ఆహ్వానించారు. ఈమేరకు బుధవారం ఆయనను కలిసి శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను మార్చి 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐజీతో పాటు ఆయన సోదరుడు ఆవుల రంగబాబును ఆహ్వానించారు. ఈయన వెంట రాయల్ కాప్స్ గౌరవ సలహాదారుడు సంజీవరాయుడు, రాయల్ కాప్స్ ఆంధ్ర, తెలంగాణ యువ పొలిటికల్ అధ్యక్షుడు శివ, రంగారెడ్డి జిల్లా ఎంకెజెఎఫ్ కన్వీనర్ గంట విజయకుమార్ ఉన్నారు.